

రైళ్లకు హాల్టు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు


పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జన్మ భూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైల్వే స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వల రాంబాబు మాట్లాడుతూ నిడదవోలు స్టేషన్‌కి జన్మభూమి ఎక్స్‌ప్రెస్, కోకినాడ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ ఇవ్వడం బడ్జెట్‌తో సంబంధం లేదన్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న అనపర్తికి హాల్ట్ ఇచ్చినప్పుడు అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌గా ఎంపికైన ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా, నియోజక వర్గం కేంద్రంగా, జంక్షన్‌గా ఉన్న నిడదవోలుకు హాల్ట్ ఇవ్వడంలో ఎటువంటి అభ్యంతరాలు ఉంటాయని ప్రశ్నించారు. తక్షణమే హాల్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గెడ్డం రవీంద్రబాబు, ఎల్లే కృష్ణంరాజు, దాసు, ప్రయాణికులు పాల్గొన్నారు.

టెట్ కలవరం

- సుప్రీం తీర్పుతో గురువుల్లో ఆందోళన
- జిల్లాలో 3వేల మంది టీచర్లపై ప్రభావం
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉపాధ్యాయులపై మరో పిడుగు పడింది. ఇన్‌సర్వీసు టీచర్లు సైతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సిందేనంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల తీర్పు ఇచ్చిన విషయం విధితమే. తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌పై ఉపాధ్యాయుల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2010కి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుల్లో కలవరం మొదలైంది. టెట్ పరీక్షపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు అధికారిక ప్రకటనేదీ లేకపోయినా గతంలో జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి జారీ చేసిన నోటిఫికేషన్, తాజాగా సుప్రీం తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు ఒకింత ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో 4,500 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో 60 శాతం మంది అంటే సుమారు 3వేల మంది తాజా తీర్పు ప్రకారం టెట్‌లో ఉత్తీర్ణత కావాల్సి ఉంది. దశాబ్దాల



బోధనానుభవం ఉన్న టీచర్లు మళ్లీ ఇప్పుడు అర్హత పరీక్ష (టెట్) ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 1998 డిఎస్‌సి నుంచి 2006 డిఎస్‌సి వరకు ఎంపికైన ఉపాధ్యాయులే ప్రస్తుతం జిల్లాలో అత్యధికంగా పనిచేస్తున్నారు.

2010లోనే నోటిఫికేషన్ జారీ

ఉపాధ్యాయ విద్యకు సంబంధించి డిఎడ్, బిఎడ్ అర్హతలున్నప్పటికీ, ఉద్యోగ నియామకాలకు అర్హత పరీక్ష టెట్‌లో ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టులో ఎన్‌సిఇఆర్‌టి నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికనుగుణంగానే తదుపరి ఉపాధ్యాయ నియామకాలన్నింటికీ టెట్‌ను తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఆ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డిఎస్‌సి-2012 రిక్రూట్‌మెంట్ నుంచి టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేశారు. ఆ తర్వాత 2014, 2018 తాజాగా మోగా డిఎస్‌సి-2025 నియామకాలన్నీ టెట్ ఉత్తీర్ణులతోనే జరిగినందున వీరి విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తే అవకాశం లేదు. ఈ క్రమంలో గతంలో అంటే 2010 కి ముందు ఉద్యోగంలో చేరిన టీచర్లు కూడా ఇప్పుడు టెట్‌రాసి అర్హత సాధించాల్సిందేనని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పునివ్వడం, ఆ మేరకు రెండేళ్లలోపే టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని నిబంధన విధించడం.. ఉపాధ్యాయుల్లో ఆందోళనకు కారణమైంది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం ఐదేళ్లకు పైబడి ఉద్యోగ కాలం ఉన్న టీచర్లంతా రెండేళ్ల వ్యవధిలో టెట్‌రాసి ఉత్తీర్ణులు కావాల్సిందే. అలా ఉత్తీర్ణత కాకపోతే ఉద్యోగంలో కొనసాగింపుపై టీచర్లలో డైలామా నెలకొంది.

టెట్ ఉత్తీర్ణత తప్పనిసరైతే....

150 మార్కులకు రెండున్నర గంటల వ్యవధితో ఉండే ఈ పరీక్షలో అర్హత సాధించడానికి ఒసి కేటగిరీ వారు 90మార్కులు(60శాతం), బిసిలు 75 మార్కులు (50శాతం), ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులు 60 మార్కులు (40శాతం) సాధించాల్సి ఉంటుంది. ఎస్‌జిటిలైతే టెట్ పేపర్-1, స్కూల్ అసిస్టెంట్లయితే పేపర్-2 రాయాలి. ఏ కేడర్ టీచర్లయినా 2030 సెప్టెంబరు 30లోగా రిటైరయ్యేవారు మాత్రం టెట్ రాయనవసరం లేదని చెబుతున్నారు. కానీ ఈ వ్యవధిలో ఉద్యోగన్నతి పొందాలంటే మాత్రం టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. ఆ ప్రకారం ఐదేళ్లకు మించి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులందరూ 2027 సెప్టెంబరు 30 లోగా టెట్ అర్హత సాధించాల్సిందేనని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై డిఇఒ కె.వాసుదేవరావును వివరణ కోరగా.. 'ఇన్ సర్వీస్ టీచర్లు టెట్‌లో అర్హత సాధించాలన్న విషయంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక సమాచారం లేదని. ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తే టెట్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తాం.'అని తెలిపారు.

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులను మినహాయించాలి

ఇన్ సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలి. గతంలో డిఎస్‌సి నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులై ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఆ తర్వాత అనేక పర్యాయాలు శిక్షణ కూడా పొందారన్నారు కావున ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ప్రభుత్వం ఈ మేరకు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణలతో ఇప్పటికే టీచర్లు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో టెట్ రాయని వారు టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పుతో సీనియర్లు, మహిళ ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.

- ఎ.షరీఫ్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న విసి ప్రసన్నశ్రీ

సాంకేతికాభివృద్ధిలో సెన్సార్లు కీలకం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి ప్రసన్నశ్రీ

ప్రజాశక్తి - రాజానగరం

ప్రస్తుత ప్రపంచం గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వంటి అనేక పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటుందని, స్థిరమైన సాంకేతికతల అభివృద్ధికి సెన్సార్లు కీలక పాత్ర పోషిస్తాయని విసి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్ షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. యూనివర్సిటీ సెమినార్ హాల్లో 'సెన్సార్స్ ఇంటర్ఫేసింగ్ అండ్ ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్' అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విసి ప్రసన్నశ్రీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ వర్క్‌షాప్ స్థిరత్వాన్ని సాధించడంలో, వన్ హెల్త్‌కు మద్దతు ఇవ్వడంలో మరియు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చడంలో సెన్సార్ల కీలక పాత్రపై దష్టి పెడుతుందన్నారు. స్థిరమైన అభివద్ధిని సాధించడంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యంత్ర అభ్యాసం, 5జీ కమ్యూనికేషన్ మరియు క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతలు పర్యవేక్షణ, నివారణ అనువర్తనాల కోసం ఉపయోగిస్తున్నారన్నారు. సెన్సార్లు ఈ తెలివైన, స్థిరమైన సాంకేతిక పురోగతికి ప్రాథమిక వెన్నెముకగా పనిచేస్తాయన్నారు. భౌతిక, రసాయన, జీవ సెన్సార్లుగా వర్గీకరించారన్నారు. వి దాదాపు అన్ని అప్లికేషన్ రంగాలను కలిగి ఉంటాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాలను ఏకీకృతం చేయడం ద్వారా, ముందుగా శిక్షణ పొందిన యంత్ర అల్గోరిథంల ఆధారంగా ప్రతిస్పందించడానికి సెన్సార్లు అధికారం పొందుతాయన్నారు. మానవ వనరుల అవసరాలను తగ్గించడం, సమాజ శ్రేయస్సు కోసం వనరుల సామర్థ్యం, స్థిరత్వాన్ని మెరుగుపరచడం ద్వారా వివిధ రంగాలలో స్మార్ట్, ఇంటిలిజెంట్ సెన్సింగ్ పరికరాలు పెద్ద ఎత్తున ఉపయోగపడుతున్నాయన్నారు. రిసోర్స్ పర్సన్స్ ఎన్‌ఐటి వరంగల్ కెమికల్ ఇంజినీరింగ్ విభాగం డాక్టర్ కెఎస్.రాజమోహన్, సిఎస్ఐఆర్ హైదరాబాద్ నుంచి ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం ఎయిర్‌బోర్న్ మరియు ఇంజినీరింగ్ జియోఫిజిక్స్ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ జి.వంశీకష్ణ హాజరయ్యారు. సెన్సార్లు ఇంటర్ఫేసింగ్ అండ్ ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గ్రీన్ నానోటెక్నాలజీ మరియు వ్యర్థాల నుండి సంపద మాడ్యూళ్ల ఏకీకరణతో మద్దతు ఇచ్చే సెన్సార్లలో స్థిరత్వాన్ని సాధించడానికి సవాళ్లు, ప్రత్యామ్నాయ పరిష్కారాలను తెలిపారు. తర్వాత అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కన్వీనర్ జె.హనుమంతు, కో-కన్వీనర్లు డాక్టర్ డి.శ్రీనివాసరావు, డాక్టర్ డి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆర్ట్స్ కళాశాల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఎస్ఎఫ్ఐ ఆర్ట్స్ కళాశాల నూతన కమిటీ శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా టి.సౌమ్య, వి.చక్రి ఎన్నికయ్యారు. ఎస్‌ఎఫ్ఐ ఆర్ట్స్ కళాశాల కమిటీ మహాసభ స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభలో 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్ మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. ఆర్ట్స్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కళాశాలలో చేరి నెల కూడా అవ్వకుండానే ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి తేవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకుండా విద్యార్థులు ఎలా కడతారని ప్రశ్నించారు. తక్షణమే ఈ వేధింపులు ఆపాలన్నారు. లేకుంటే విద్యార్థులందరినీ కలుపుకుని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆర్ట్స్ కళాశాలలో నూతనంగా టాయిలెట్స్ నిర్మాణం చేశారని, అయితే రన్నింగ్ వాటర్ లేక అవన్నీ నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వాటిని వాడుకలోకి తీసుకురావాలన్నారు. పెండింగులో ఉన్న రూ.6వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని అభినందించారు. ఈ కమిటిలో సురేష్, శివ బాలాజీ సహాయ కార్యదర్శిలుగా కార్తిక్, అఖిల్ ఉపాధ్యక్షులుగా కనక, లహరి, జ్యోతి, నాగచైతన్య, సంతోష్, సుకుర్, గౌతమి, రత్న కుమార్, సాయి, దీపక్, పుష్ప కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఇదే...

సురక్ష యాప్‌తో నకిలీ మద్యం నియంత్రణ

కొవ్వూరు : నకిలీ మద్యం నియంత్రణకు, ప్రజా భద్రత కోసం శనివారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించామని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి కొవ్వూరు టౌన్ లోని మద్యం దుకాణాలను సందర్శించి దీనిపై అవగాహన కల్పిస్తామన్నారు. కూటమి నాయకులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

సిఎంఆర్‌ఎఫ్‌తో పలువురికి సాయం


కొవ్వూరు : వైద్య సేవలు, తక్షణ అవసరాల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేకమందికి ఆర్థిక సాయం అందిస్తున్నామని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు రూ.5.23 లక్షల విలువైన చెక్కులను ఆయన అందించారు. మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి ముని రాజేంద్రప్రసాద్, నాయకులు దాయన రామకృష్ణ, ఎ.రామకృష్ణ, ఆరికరేవుల పిఎసిఎస్ అధ్యక్షుడు చావా శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా దేవరపల్లిలో ఆనంద్ విద్యా సంస్థల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉమెన్స్ పరిరక్షణ సెల్ఫ్ డిఫెన్స్, ప్రస్తుత పోలీస్ వ్యవస్థ పనితీరు అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం ట్రైనీ ఎస్ఐ పి.దినేష్, కానిస్టేబుళుఆర్.వెంకటరమణ హాజరయ్యారు.

కార్టూ'నిజం'



పుష్కరాల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ

కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

2027 జరిగే గోదావరి పుష్కరాలను విజయవంతం నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ అవసరమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవార కలెక్టరేట్ సమావేశ మందిరంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత శాఖలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పోలీస్, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పుష్కరాలకు చేపడుతున్న ఏర్పాట్లను వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత పుష్కరాల అనుభవాలను పరిగణలోకి తీసుకొని 2027 గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలన్నారు. సుమారు ఆరు కోట్ల మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారికి మౌలిక సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, రవాణా వ్యవస్థ, వసతి, ఆహారం, వైద్య సేవలు, స్వచ్ఛత వంటి అంశాలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలను నిర్దేశించి దశలవారీగా పనులు పూర్తి చేయాలన్నారు. ట్రాఫిక్, క్రౌడ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశాలపై పోలీస్ శాఖ రూపొందించిన ప్రణాళికలను మరింత శాస్త్రీయంగా అమలు చేయాలని సూచించారు. విశాఖ విజయవాడ, ఖమ్మం ప్రాంతాల నుంచి రాజమండ్రి మీదుగా వచ్చే వాహనాలను పట్టణంలోకి రానివ్వకుండా ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేయాలన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పుష్కరాలకు వచ్చే వాహనాలు పట్టణ సరిహద్దుల్లో ఏర్పాటు చేయబోయే ప్రత్యేక పార్కింగ్ జోన్లలో నిలిపి, అక్కడి నుంచి షటిల్ బస్సులు నడిపి భక్తులను ఘాట్లకు తరలించాలన్నారు. పుష్కరాల సమయంలో రోజుకు సుమారు రెండు లక్షల మంది రైలుమార్గంలో, 25 వేల మంది బస్సుల ద్వారా రావచ్చని అంచనా ఉన్నందున, రైల్వే, ఆర్టీసీ, రవాణా శాఖలు సమన్వయంతో వారం రోజుల్లో సమగ్ర ప్రణాళిక సమర్పించాలని సూచించారు.పుష్కరాల దష్ట్యా పట్టణంలోని సుమారు 25 ప్రధాన రోడ్ల విస్తరణ ప్రతిపాదనలో ఉందని కలెక్టర్ తెలిపారు. వీటిలో ముఖ్యంగా తూర్పు రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్ట్, కాతేరు, మోరంపూడి నుంచి సరస్వతి ఘాట్ రోడ్డు, కోటిలింగాల ఘాట్ రోడ్డు మార్గాల విస్తరణ ద్వారా రాకపోకలు సులభతరం అవుతాయన్నారు. నగరంలో ఖాళీ స్థలాలను గుర్తించి పార్కింగ్ జోన్లు, తాత్కాలిక వసతి గృహాలు, ఆహార పంపిణీ కేంద్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలు ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో 34 ఘాట్లు, కొవ్వూరు నియోజకవర్గంలో 31 ఘాట్లు కలిపి మొత్తం 65 ఘాట్లు 2.7 కిలోమీటర్ల మేర ఉన్నాయన్నారు. కొత్తగా 1.95 కిలోమీటర్ల మేర ఘాట్లను విస్తరించడం, నూతనంగా నిర్మించడం ద్వారా మొత్తం 4.7 కిలోమీటర్ల మేర ఘాట్లు అందుబాటులోకి వస్తాయన్నారు.

విఐపిల కోసం విమానాశ్రయం, జాతీయ రహదారుల సమీపంలో ప్రత్యేక ఘాట్లను ఏర్పాటు చేయాలన్నారు.వద్దులు, మహిళలు, వికలాంగులు పుష్కర స్నానాలు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధవలేశ్వరం నుంచి సీతానగరం వరకు గోదావరి ఫ్లడ్ బ్యాంక్ రహదారి అభివృద్ధి చేయడం ద్వారా నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని ఇరిగేషన్ అధికారులు వివరించారు.

పుష్కరాలు వర్షాకాలంలో జరిగే అవకాశం ఉన్నందున, వరదల ప్రభావాన్ని దష్టిలో పెట్టుకొని డ్రెయినేజీ సిస్టమ్, ఘాట్ల స్థిరత్వం, భక్తుల భద్రత వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్, సీసీ కెమెరా పర్యవేక్షణ, హెల్ప్ సెంటర్లు, ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్స్, స్వచ్ఛత సిబ్బంది మరియు వాలంటీర్లను సమన్వయంతో పనిచేయించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి డి.నరసింహకిషోర్, కార్పొరేషన్ కమిషనర్ రాహుల్‌మీనా, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, ఆర్‌డిఒలు రాణిసుష్మిత, ఆర్.కృష్ణనాయక్, ఆర్ఎంసి అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసి

గోదావరి బాలోత్సవం తాత్కాలికంగా వాయిదా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో ఈనెల 25, 26 తేదీల్లో జరగాల్సిన గోదావరి బాలోత్సవం మూడో పిల్లల పండుగ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి వెల్లడించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఇంకా కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నిర్వహణకు పరిస్థితులు అనుకూలించడం లేదని తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలోత్సవంలో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తెలిపారు. వర్షాలకు ఎస్‌కెవిటి కళాశాల మైదానం కూడా నీటిలో మునిగిపోయిందని దీని వల్ల ఏర్పాట్లకి ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహణ కమిటీ సమావేశమై తాత్కాలికంగా వాయిదా వేయడానికి నిర్ణయం తీసుకుందన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామన్నారు. పాఠశాలల యాజమాన్యాలకు వాయిదా వేసిన విషయాన్ని తెలియజేస్తున్నామని, విద్యార్థులు, వారి తల్లితండ్రులు కూడా పరిస్థితిని అర్థం చేసుకోవాలని తులసి కోరారు. కార్యక్రమం వాయిదా పడిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌కి కూడా ఇంకా గడువు ఇస్తున్నామని తెలిపారు. బాలోత్సవంలో పాల్గొనాలనే ఆసక్తి ఉండి ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారు దరఖాస్తులు పంపొచ్చన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాయిబాబు, ఉపాధ్యక్షురాలు ఐ.నవీనకుమారి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రవీంద్ర, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు నిలిపేయాలి : ఎఒ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం:

వర్షాల నేపథ్యంలో ప్రస్తుతం వరి కోతలను నిలిపేయాలని ఎఒ బి.రాజారావు రైతులకు సూచించారు. వర్షాలు నిలిచిపోతే వరి పంటకు ఎటువంటి నష్టమూ ఉండదన్నారు. వర్షాలకు మండలంలోని పసలపూడి, వేలివెన్ను, పాలంగి, తదితర గ్రామాల్లో 150 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. ఈ సందర్భంగా తుపాను, అధిక వర్షాల నేపథ్యంలో అధికారులు సూచించిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆరని పనలను కుప్పలు వేసే సమయంలో ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ, కుప్ప వేసుకోవాలన్నారు.

వాలీబాల్ పోటీల్లో దుద్దుకూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - దేవరపల్లి

కొవ్వూరులో జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపికల్లో దుద్దుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్-17 విభాగంలో పి.నవీన్‌కుమార్, పైడిమల్ల హనీ, అలాగే అండర్-14 విభాగంలో బడిత ఆకాష్‌బాబు, పోలిమాటి భానుతేజ, గొల్లపల్లి భూమిక, మద్దాల వెన్నెల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం పి.వీర్రాజు తెలిపారు. అండర్-17 విభాగంలో ఎంపికైన వారు ఈ నెల 31 నుంచి కొవ్వూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-14 విభాగంలో ఎంపికైన వారు నవంబర్ మొదటి వారం నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

రఘుదేవపురంలో ఉపాధి గ్రామసభ

సీతానగరం : రఘుదేవపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ భారతి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామ సభను శుక్రవారం నిర్వహించారు. ఎపిఒ సత్యవతి మాట్లాడుతూ గ్రామ సభలో 25 పంట కాలవలు, చెరువులు 2, ఫారం పాండ్ లు 2, కంపోస్ట్ పిట్లు 20,గోకులాలు 5 గుర్తించామన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇండుగమిల్లి చంద్రలీల, సెక్రటరీ బరుకుల రత్నం,టెక్నికల్ అసిస్టెంట్లు సింహాద్రి, ఫీల్డ్ అసిస్టెంట్ నారే సుబ్బారావు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టెట్ పేర ఒత్తిడి తగదు : ఎంఎల్‌సి గోపిమూర్తి

ప్రజాశక్తి-గోకవరం

డిఎస్‌సి ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులంతా తిరిగి టెట్ పరీక్షలు రాయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం సబబు కాదని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి అన్నారు. మండ లంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యా రంగ సమస్యలపై శాసన మండలిలో పోరాడే ఏకైక వ్యక్తిగా, పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఉండడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. టెట్ సమస్య పరిష్కారం నిమిత్తం ప్రభుత్వమే ఉపాధ్యాయుల పక్షాన అఫిడవిట్ వేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పాఠాలు బోధించే స్వేచ్ఛని ఇవ్వాలన్నారు. బోధనేతర పనుల నుంచి వెసులుబాటు కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేయడమే తన లక్ష్యమన్నారు. ఎంఎల్‌సిగా తన గెలుపునకు కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట యుటిఎఫ్ నాయకులు కె.నాగభూషణం, ఎం.ప్రేమకుమార్, ఆర్.హరనాథ్, పంతం త్రిమూర్తులు, ఎస్.కుమార్, చిక్కం సతీష్ బాబు ఉన్నారు.



ఉపాధ్యాయులతో పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపిమూర్తి

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆధార్ బయోమెట్రిక్ పెండింగ్ ఉన్న విద్యార్థుల కోసం పాఠశాలలోనే ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. స్థానిక జెఎన్ రోడ్‌లోని రూట్స్ స్కూల్‌లో ఆధార్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. రాష్ట్ర గ్రామ సచివాలయం, వార్డ్ సచివాలయం డైరెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 23 నుంచి 31 వరకూ ఎంపిక చేసిన స్కూల్స్, కళాశాలలలో 5 నుంచి 17 వయస్సు గల వారికి సచివాలయ సిబ్బందిచే ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సేవలు ఉచితంగానే లభిస్తాయన్నారు.

తాళ్లపూడి : విద్యార్థుల కోసం ఈ నెల 31 వరకు మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. తాళ్లపూడిలోనే మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద, మలకపల్లి లోని రవీంద్ర భారతి స్కూల్ వద్ద ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ తెలిపారు.

పోలియోపై అవగాహన

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

రోటరీ క్లబ్ నిడదవోలు మిడ్ టౌన్ ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం క్లబ్ అధ్యక్షులు గుబ్బల సత్యప్రసాద్ ఆధ్వర్యంలో రావిమెట్ల గ్రామంలో పోలియోపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ఆనందం మురళీకృష్ణ, సభ్యులు పెచ్చెట్టి ఫణిసింహ, ఎల్లే ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడదవోలు : పట్టణంలో స్థానిక జడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో వరల్డ్ పోలియో డేను నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామహరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలియోపై అవగాహనా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు దారపురెడ్డి శ్రీరామప్రతాప్, గుంటుపల్లి సత్యసాయి, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎమ్‌డి ఫయాజ్, పొన్న సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం రాజేశ్వరిఫిలిప్స్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : శుక్రవారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిహెచ్‌సి వైద్యాధికారి కె.శైలజరాణి ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో వ్యతిరేక దినోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.రఘునాథ్, వైద్య సిబ్బంది వైఎస్.రాయుడు, కె.ఆదిలక్ష్మి, నాగమణి, శిల్ప, గంగాధర్, అరుణ, జ్యోతి, పద్మ, కుమారి, కృష్ణవేణి, శాంతి, రమణమ్మ, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్యపై దాడి కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి - పి.గన్నవరం

భార్యపై చాకుతో గాయపరిచిన భర్త నేలపూడి గంగరాజును శుక్రవారం ఉడిమూడిలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని పి.గన్నవరం ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. దీపావళి రోజు రాత్రి నిందితుడు గంగరాజు తన భార్య పల్లాలమ్మను చాకుతో చంపుతామని బెదిరించి, కత్తితో గొంతులో ఆమె పొడిచాడు. ఈ ఘటనలో ఆమె తల తిప్పడంతో కంటి పై భాగంలో బలంగా గాయమైంది. కాకినాడ జిజిహెచ్‌లో సర్జరీ చేసి చాకును తీశారు. దీంతో ఆమె చికిత్స పొందుతోంది. నిందితుడు గంగరాజును కొత్తపేట మెజిస్ట్రేట్ ముందు హాజరపరిచి రిమాండ్‌కి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు ఇసుక లారీల స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

అధిక లోడుతో వెళ్తున్న నాలుగు ఇసుక లారీలను అధికారులు పట్టుకున్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరులో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు ఇసుక ర్యాంపులను తనిఖీ చేశారు. దొండగుంట గ్రామంలోని డిసిల్టేషన్ రీచ్ వద్ద పరిమితికి మించి అధిక లోడ్‌తో వెళ్తున్న నాలుగు లారీలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకని తదుపరి చర్యల కోసం సంరక్షణ నిమిత్తం కొవ్వూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పబ్బితి రెడ్డి సుధీర్ రెడ్డి పేరుతో ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం రాజవరం గ్రామానికి నాలుగు లారీల్లో ఒక్కొక్క లారీకి సుమారు 36 టన్నుల ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 12 నుంచి ఈ నెల 23 మధ్య మొత్తం 2071 మెట్రిక్ టన్నుల ఇసుక పొందినట్లు అధికారులు గుర్తించారు. రాజవరంలో అధికారులు తనిఖీ చేసినప్పుడు ఎటువంటి ఇసుక నిల్వలు లేవని నిర్ధారించారు. ఈ ఇసుక తెలంగాణ రాష్ట్రానికి రవాణా చేస్తున్నట్లు గుర్తించామని మైనింగి ఎడి ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి.జ్యోతిర్మయి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకురాలి అరెస్ట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కూటమి నాయకుల ఫ్లెక్సీల రూపురేఖలను మారుస్తోందనే అభియోగంపై వైసిపి మహిళా విభాగం నాయకురాలు అనుని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంట్లో ఉండగానే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ భరత్ తన అనుచరులతో త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అను అరెస్ట్‌పై పోలీసులను నిలదీశారు. ఈ సందర్భంగా పోలీసులకు, వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. తమ నాయకులను, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేస్తోందని, వేధింపులకు గురి చేస్తోందన్నారు. బాలిక అత్యాచార ఘటనపై శాంతియుతంగా ధర్నా చేశాం తప్ప ఎవర్నీ అగౌరవ పర్చలేదన్నారు. గురువారం బిసి హాస్టల్ వద్ద వైసిపి నిర్వహించిన ధర్నా సమయంలో సమీపంలోని గోడలపై కూటమి నాయకుల ఫ్లెక్సీల రూపురేఖలను అను మార్చారనే అభియోగంపై అనుపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. భరత్ వెంట వైసిపి నాయకులు మజ్జి రాంబాబు, గుర్రం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగులు

140 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

టాటానగర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 140 కేజీల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.7లక్షల వరకూ ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12.45 గంటలకు రైలు సామర్లకోట రైల్వే స్టేషన్‌లో మూడో నెంబర్ ప్లాట్‌ఫామ్‌కి చేరుకుంది. ఈ సమయంలో ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. ఎస్1 నుంచి ఎస్6 వరకు ఉన్న స్లీపర్ బోగీలను పరిశీలించగా యజమానులు లేని 15 సంచులు లభించాయి. వాటిలో గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. వాటిని తూకం వేయగా 140 కేజీలు ఉన్నట్టు గుర్తించారు. మేరకు కేసును నమోదు చేశారు. ఈ సంచులు ఎవరు తీసుకొచ్చారనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్‌పిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిఆర్‌పి ఎస్ఐ వాసు, ఎఎస్ఐలు వరప్రసాద్, సత్యనారాయణ, పెద్దిరాజు పాల్గొన్నారు.

కోర్టు కేసులపై అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కోర్టు కేసుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో కౌంటర్లు, అవసరమైన కేసుల్లో అప్పీలు దాఖలు చేయాలని కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్లో శుక్రవారం అన్ని విభాగాల హెచ్‌ఒడిలతో ఆయన సమావేశం నిర్వహించారు. కోర్టు కేసులకు సంబంధించి ముఖ్యంగా ధిక్కారం కేసులపై అధికారులు తక్షణం స్పందించాలన్నారు. ఏదైనా కోర్టు ఉత్తర్వులు ఉంటే వాటిని అమలు చేయాలని, లేదంటే కౌంటర్లు, అప్పీళ్లు దాఖలు చేయాలన్నారు. అత్యధికంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రాథమిక దశలోనే ప్రభుత్వ ఉత్తర్వులు గాని, సూచనలు గాని కోర్టుకు అందిస్తే, కోర్టు వారు ఆ కేసును అనుమతించరన్నారు. మధ్యంతర ఉత్తర్వులు వస్తే వాటిని అమలు చేసి పక్కాగా రికార్డు చేసుకోవాలన్నారు. కోర్టు ధిక్కరణ ఎట్టి పరిస్థితుల్లోనూ కాకూడదని స్పష్టం చేశారు. వచ్చే సమావేశానికి శాఖల వారీగా ప్రోగ్రెస్ చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, అన్ని విభాగాల హెచ్‌ఒడిలు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ మూర్తి

మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతానికి సమిష్టి కృషి అవసరమని డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి అన్నారు. డిఆర్‌డిఎ-సెర్ప్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్‌లోని సైన్స్ మ్యూజియం సమావేశ మందిరంలో బ్యాంక్ కంట్రోలర్లు, బ్యాంక్ మేనేజర్లు, డిఆర్‌డిఎ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీ మూర్తి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక చేకూర్పు చేసే విధానంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మహిళా సంఘాలను ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. రుణాల విడుదలలో పారదర్శకత పాటించాలన్నారు. ఎంసిపిని అనుసరించి ఎంసిపిల అమల్లో ఆంక్షలు, నిలుపుదల, మహిళా నేతత్వంలోని వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్, ఎస్‌సిహెచ్‌జి పొదుపు మొత్తంలో స్థిర డిపాజిట్లు, ఎన్‌పిఎ ఎస్‌సిహెచ్‌జిల రికవరీ, పిఎంఇజిపి, ప్రధానమంత్రి ఉపాధి సృష్టి పథకం, పిఎంఎఫ్ఎంఇ- ప్రధాన్ మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజస్ పథకం యూనిట్ల గ్రౌండింగ్ వంటి అంశాల్లో సమస్యలపై ఈ సమావేశం నిర్వహించామన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా మంజూరు చేసిన మొత్తాన్ని రుణ మొత్తానికి సర్దుబాటు చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. అంతర్గత రుణాల సక్రమ వినియోగం జరగాలన్నారు. ప్రతి కుటుంబం నుండి ఒక మహిళ పారిశ్రామిక వేత్తగా తయారు కావడానికి కృషి చేయాలన్నారు. 2025-26 సంవత్సరానికి ఎంసిపి మోడల్ కింద 9246 ఎస్‌సిహెచ్‌జీలు రూ.698.83 కోట్ల లక్ష్యం కాగా ఇప్పటివరకు 6182 ఎస్‌సిహెచ్‌జీలు రూ.461.18 కోట్ల మేర సాధించామన్నారు. రుణాల చెల్లింపులు, వసూళ్లలో సమస్యలుంటే వెంటనే డిఆర్‌డిఎ దృష్టికి తీసుకురావాలన్నారు.

లీడ్ బ్యాంక్ మేనేజర్ డివి.ప్రసాద్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయ సంఘాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రతి బ్యాంకు శాఖ మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం ఎస్‌సిహెచ్‌జిలకు సమయానికి రుణాలు మంజూరు చేయాలన్నారు. గ్రౌండింగ్ ప్రక్రియలో బ్యాంకులు చురుకైన భాగస్వామ్యం వహించాలన్నారు. ఈ సమావేశంలోలో అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ వైటి.నాయుడు, డిపిఎం వై.జనార్ధనరెడ్డి, అన్ని బ్యాంక్ కంట్రోలర్లు, బ్రాంచ్ మేనేజర్లు, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి

కమిషనర్ రాహుల్ మీనా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ



నగరాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు పారిశుధ్య పనులను సక్రమంగా, మరింత మెరుగ్గా చేపట్టాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. శుక్రవారం తెల్లవారుజామున 8వ వార్డు ప్రకాష్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే ఇంటింటా చెత్త సేకరణ మొదలు కావాలన్నారు. ప్రతీ వాహనానికి రూట్ మ్యాట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే పలు వీధుల్లో గ్రౌండ్ డ్రెయినేజీ నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. వర్షాల నేపథ్యంలో డ్రెయినేజీల్లో ఎక్కడా నీరు నిలిచిపోకుండా చూసుకోవాలన్నారు. రోడ్లపైన వ్యర్థాలు ఉండటానికి వీల్లేదని, ఊడ్చిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. దీని కోసం స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలం చుట్టూ గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా స్థానికులు చెత్త వేయకుండా పరిరక్షించొచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆయన వెంట నగర ఆరోగ్యశాఖాధికారి వినూత్న, ఇతర అధికారులు, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు : విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం సిటీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాయ మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు టికె.విశ్వేశరరెడ్డి విమర్శించారు. హాస్టల్ విద్యార్థినిపై అత్యాచార ఘటనకు నిరసనగా శుక్రవారం ఆయన రాజమహేంద్రి కళాశాల విద్యార్థినులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటన ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపులో లేదని, ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలపై దృష్టి పెడుతుంది తప్ప శాంతి, భద్రతలను కాపాడట్లేదన్నారు. ఇసుక, అక్రమ మద్యం వ్యాపారాలపై ఉన్న మక్కువ పాలనపై లేదన్నారు.అత్యాచారం జరిగి ఆరు రోజులైనా లాడ్జిని ఎందుకు సీజ్ చేయలేదని ప్రశ్నించారు. ఈ ధర్నాలో జెటి.రామారావు, కాంగ్రెస్ పార్టీ మహిలా విభాగం జిల్లా అధ్యక్షురాలు శారద, ప్రచార కమిటీ అధ్యక్షులు డాక్టర్ వడయార్, నిడదవోలు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి భద్రం దొర తదితరులు పాల్గొన్నారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రావులపాలెంలో విషాదం

కర్నూలు బస్సు ప్రమాదంలో శ్రీనివాసరెడ్డి సజీవదహనం

ప్రజాశక్తి - కొత్తపేట



శ్రీనివాసరెడ్డి(ఫైల్)

రావులపాలెంలో విషాదం నెలకొంది. కర్నూలులో జరిగిన బస్సు దగ్ధం ఘటనలో రావులపాలేనికి చెందిన కొవ్వూరు శ్రీనివాసరెడ్డి(39) సజీవదహనమయ్యారు. ఆయన స్వగ్రామం రావులపాలెం మండలం ఊబలంక. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లి మృతి చెందడంలో తండ్రి, అలాగే అతని మావయ్య కూడా అతనితోనే కలిసి ఉంటున్నారు. శ్రీనివాసరెడ్డి క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు సోదరిలకు వివాహం చేశారు. వారంతా రావులపాలెంలోనే స్థిరపడ్డారు. దీంతో శ్రీనివాసరెడ్డి కుటుంబం కూడా రావులపాలేనికి వచ్చేసింది. రావులపాలెంలోని ఆదిలక్ష్మినగర్ ఐదో వీధిలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వీరందరికీ శ్రీనివాసరెడ్డే దిక్కు. ప్రస్తుతం ఆయన పని చేసే క్రేన్లు బెంగళూరులో ఉన్నాయి. అక్కడ పనిచేసేందుకు శ్రీనివాసరెడ్డి వెళ్లాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 22న రావులపాలెం నుంచి హైదరాబాద్ వెళ్లాడు. గురువారం రాత్రి బెంగళూరు వెళ్లేందుకు హైదరాబాద్‌లో వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కాడు. కర్నూలులో జరిగిన ప్రమాదంలో సజీవ దహనమయ్యాడు. ఆయన మృతి వార్త తెలియగానే రావులపాలెంలో విషాదం నెలకొంది. మృతుని ఇల్లు రోదనలతో నిండిపోయింది. ఇంటికి దిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోవడంతో వారంతా కన్నీరుమున్నీరవుతున్నారు.

నేటి నుంచి ఇంటింటా ఫీవర్ సర్వే

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నగరంలో శనివారం నుంచి ఫీవర్ సర్వే నిర్వహిస్తామని కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న తెలిపారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి సర్వే చేపట్టి జ్వర పీడితులను గుర్తించి వారందరికీ వైద్య సాయం అందిస్తామన్నారు. ప్రజలందరూ సర్వే బందానికి సహకరించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి - కొవ్వూరు



వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించడం కోసమే ప్రతివారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. కొవ్వూరు టిడిపి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 8 వినతి పత్రాలు అందాయన్నారు. ఎఎంసి చైర్మన్ నాదెండ్ల శ్రీరామ్, దాయన రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్యార్థులతో పాటూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకుని సైబర్, ఇతర నేరాలకు గురికాకుండా జాగ్రత పడాలని ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తాళ్లపూడిలోని కరిబండి విద్యాసంస్థల ప్రాంగణంలో కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు, మహిళలు పిల్లల రక్షణ అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'క్లాస్ రూమ్ టు అసెంబ్లీ' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీలను విజయవంతంగా నిర్వహించామని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల మండల స్థాయి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. సిటీ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.ఐజాక్‌కుమార్ ప్రథమ, గాంధీపురం-2 ఉన్నత పాఠశాల విద్యార్థిని సిహెచ్.దీపాంజలి ద్వితీయ స్థానం, గాంధీపురం-2 విద్యార్థిని షేక్ సల్మా, ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.తేజస్విని తృతీయ స్థానంలో నిలిచారన్నారు. వీరు ఈ నెల 29న జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ర్యాలీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరులో ఈనెల 28న నిర్వహించే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటుకు అప్పగించడాన్ని నిరసిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా నిరసన ర్యాలీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కొవ్వూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన నిరసన ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కోడూరి శివరామకృష్ణ, గండ్రోతు సురేంద్ర కుమార్, రుత్తల భాస్కరరావు, జుట్ట ఏడుకొండలు, చెల్లింపుల దుర్గా మల్లేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, ఉప్పులూరి సూరిబాబు, పరిమి సోమరాజు, మట్ట వెంకట్రావు నగలపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

సీతానగరం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం



సీతానగరం మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతిని ధులు చెరుకూరి సూరిబాబును ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా కొల్లి రాజు, సలహాదారునిగా సనమండ్ర లాజరు, ప్రధాన కార్యదర్శిగా అరవపల్లి సురేష్, సంయుక్త కార్యదర్శిగా నల్లి పెదబాబు, ట్రెజరర్‌గా ఆరాధ్యుల సాయి ఎన్నికయ్యారు.కార్యనిర్వహణ సభ్యులుగా దారా జీవన్ బాబు, పసలపూడి రత్నరాజు, తాతపూడి బెంజిమెన్, బందిల దుర్గాప్రసాద్, మెరుపో రమేష్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు ప్రముఖులు పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకూరి సూరిబాబు మాట్లాడుతూ సభ్యులందరినీ కలుపుకొని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అధ్యాపకుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కొవ్వూరు



ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సునీత

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల సేవలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపల్ సునీత సూచించారు. శుక్రవారం కొవ్వూరు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే సమావేశంలో ఆమె మాట్లాడారు. కళాశాలలో చేరుతున్న విద్యార్థులు సీనియర్స్ నుంచి మంచి విషయాలను నేర్చుకుని సన్మార్గంలో ముందుకు నడవాలని సూచించారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా సూర్యప్రకాష్

ప్రజాశక్తి-గోకవరం



సూర్యప్రకాష్‌ను సత్కరిస్తున్న నాయకులు

గోకవరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా ప్రముఖ వ్యాపార వేత్త కంచర్ల సూర్య ప్రకాష్ నియ మితులయ్యారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు పూల మాలలు, శాలువలతో సత్కరించారు. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే వీరభద్రుని గద్దె కమిటీ అధ్యక్షునిగా కంచర్ల అవినాష్, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షునిగా అచ్చు సుబ్రహ్మణ్యంతో పాటు ఆయా కమిటీలకు సంబంధించి సుమారు 40 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బత్తుల సత్తిబాబు, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ ప్రగళ్లపాటి కనకరాజు, కంచర్ల నరసింహామూర్తి, కటకం చలం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలకు తపస్విరెడ్డి ఎంపిక

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

నిడదవోలు నారాయణ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కెఎస్‌పి.తపస్విరెడ్డి చెస్ విభాగంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కొవ్వూరు డివిజన్ స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు ఎంపికయ్యాడు. ఈ పోటీల్లో తొమ్మిది మండలాల నుంచి విద్యార్థులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ఎస్‌జిఎఫ్ నిర్వాహకులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గంగంపాలెం ప్రభుత్వ ఎంపియుపి పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. హెచ్‌ఎం హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఆప్తమాలజిస్ట్ సిహెచ్.ఆనందరావు, కొత్తపల్లి పిహెచ్‌సి వైద్య సిబ్బంది 105 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించారు. వీరందరికీ త్వరలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా నేత్రదానంపై అవగాహన కల్పించారు. అనంతరం నేత్రదానంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జి.పవన్, ప్రియాంక, బుజ్జమ్మ, ఆశా వర్కర్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్లెయిమ్ పత్రాన్ని అందిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

మృతుని కుటుంబానికి క్లెయిమ్ పత్రం అందజేత

ప్రజాశక్తి - చాగల్లు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మార్కొండపాడుకు చెందిన ఉప్పులూరి శివలీల కుటుంబానికి రూ.5లక్షల క్లెయిమ్ పత్రాన్ని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం అందించారు. ఆమె ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాధంలో మరణించారు. ఆమెకు టిడిపి క్రియాశీలక సభ్యత్వం ఉంది. ఈ మేరకు రూ.5 లక్షల క్లెయిమ్ పత్రాన్ని ఎంఎల్ఎ వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, కూటమి నాయకులు. పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి చాగల్లు

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఊనగట్ల విద్యార్థినిలు ఎంపికయ్యారు. కొవ్వూరు పిఎంఆర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్-14 విభాగంలో ఊనగట్ల జడ్‌పిఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ చూపిన ఇద్దరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎన్‌వి.రమణ తెలిపారు.వారికి కోచింగ్ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు కొయ్య గంగాధరరావు, విద్యార్థినులను ఆయన అభినందించారు. అలాగే పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నందిగం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు బొల్ల శివనాగేంద్ర, ఎస్ఎంసి చైర్మన్ కామన శివ ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు వారిని అభినందించారు.